‘విశ్వావసు’లో అందరికీ శుభాలు

- ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం

తోట్లవల్లూరు: విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించి తెలుగు సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని కోరుకున్నారు. లక్ష్మీదేవికి ప్రీతికరమైన పిండివంటలు, పూలు, పండ్లు, ఉగాది పచ్చడితో మహిళలు పూజలు నిర్వహించారు. ఆలయాలను దర్శించుకుని కొత్త ఏడాదిలో అన్ని విజయాలు కలగాలని ప్రార్థించారు. స్థానిక శ్రీవిజయదత్త షిరిడీ సాయినాథుని ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవిచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సీతయ్య మాట్లాడుతూ వేసవి వేడి అధికంగా ఉన్న నేపథ్యంలో భక్తులకు ఈ మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కల్యాణ మందిరం అధ్యక్షుడు పోకూరి మోహన్‌రావు, బొగ్గారపు తిరుపతయ్య, సామి రామ్మోహనరావు, సీహెచ్ ఉమాశంకర్, చంద్రశేఖర్, సూరే గాంధి, బి. కుటుంబరావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాదిని ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేసి తమకు మంచి జరగాలని వేడుకున్నారు.

పంచాంగ శ్రవణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే అనేకమంది భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో వేద పండితులు ఆసూరి రంగానాథాచార్యులు, కోట శివశంకరశర్మ, ప్రధాన అర్చకులు తోలేటి వీరభద్రశర్మ పురోహితులు జోస్యులు, బాలగంగాధర్ తిలక్ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. వడాలి శ్రీజగన్నాథస్వామి, గురజ శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.



గుడ్లవల్లేరు మండలం కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో పంచాంగ శ్రవణం

పంచామృత అభిషేకం

పామర్రు: విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక విష్ణాలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలను చేశారు. ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు భార్గవ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. సోమేశ్వరస్వామి ఆలయంలో లంకా భీష్మ కుమార్, విష్ణాలయంలో భార్గవ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో

ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డ వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.



పామర్రు వీరాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

కైకలూరులో ఉగాది వేడుకలు

కైకలూరు: ఉగాది వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కలిదిండి జెడ్పీ హైస్కూల్‌లో ఆధ్యాత్మిక మహామండలి అధ్యక్షుడు నంబూరి విజయనరసింహారాజు(బాండు రాజు) ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్ దాస్ ప్రసంగించారు. అనంతరం అన్నమయ్య పద సాహిత్య ప్రచారకురాలు కొండవీటి జ్యోతిర్మయి కార్యక్రమం ఆకట్టుకుంది. కై కలూరు సాహితీమిత్రుల ఆధ్వర్యంలో విద్యాంజలీ కాలేజీ వద్ద ఉగాది పురస్కారాల కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయుడు దండే బెనర్జీ, విద్యాంజలీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జమీల్ అహ్మద్, ప్రముఖ రచయిత్రి రుద్రపాక సామ్రాజ్యలక్ష్మికి ఉగాది పురస్కారాలు అందించారు. అనంతరం రుద్రపాక సామ్రాజ్యలక్ష్మి రచించిన శ్రీరామశతకం, దివంగత మోరు వెంకటేశ్వరరావు రచించిన కొల్లేటికవి సంకీర్తనల పుస్తకాలను ఆవిష్కరించారు. సాహితీమిత్రుల అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి బాలకృష్ణారావు, చింతపల్లి వెంకటనారాయణ, కవి యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం, గురజాడ ఉదయశంకర్, గుర్రం శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



కలిదిండిలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న రాధా మనోహర్ దాస్

కొండలమ్మ సన్నిధిలో..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుడు జె.పి.వి.ఎస్.శర్మ పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పాలపొంగళ్లు సమర్పించారు. అర్చకుడు శ్రీ శివసంతోష్, అమ్మవారి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితులు



తోట్లవల్లూరులో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



గుడివాడలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కొనకళ్ల సీతయ్య తదితరులు

క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



గుడివాడ టౌన్: స్థానిక కాకర్ల వీధిలో శ్రీరామాలయం దేవస్థానం పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఆదివారం ఘనంగా ఊరేగించారు. మున్సిపల్ మాజీ ప్రతిపక్షనేత గణపతి లక్ష్మణరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను సిద్ధం చేశారు. విగ్రహాల శాంతి నిమిత్తం కాకర్ల వీధిలో మేళతాళాలు మధ్య ఊరేగింపు చేశారు. సుమారు 50 సంవత్సరాలు చరిత్ర కల్గిన దేవస్థానం పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ విగ్రహాలు అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బోర్‌వెల్ ఏర్పాటు



పమిడిముక్కల: పెనుమత్స ఎస్సీ కాలనీలో ప్రజల తాగునీటి అవరాల కోసం గ్రామానికి చెందిన దాత దండమూడి రాధామణి రూ.90 వేలతో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రముఖలు మొవ్వ రాముతో కలిసి రాధామణి శనివారం బోర్‌వెల్‌ను ప్రారంభించారు. తన మామ దండమూడి సుబ్బారావు జ్ఞాపకార్థం బోర్‌వెల్ ఏర్పాటు చేసినట్లు రాధామణి తెలిపారు.

వాణి శతకం పుస్తకావిష్కరణ



గుడివాడ టౌన్: సమాజంలో సాహిత్యం అంతర్భాగమని గుడివాడ తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ కె. రామశివ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో భారతి సమితి ఆధ్వర్యంలో విశ్వవాసునామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని వాణి శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రపాక పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పద్యకవి శిరోమణి పీవీఎన్‌వీ రాజకుమారి రచించిన వాణిశతకం సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సాహిత్యంలో వాస్తవం లేదా ఊహాజనితం, వర్ణం, అశువు ఉండవచ్చన్నారు. ఇవి సమాజహితానికి మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు, డీఆర్‌బీ ప్రసాదు, ఎం. మాధవరావు, వీవీ. రాఘవాచారి, అవిర్నేని వెంకటేశ్వరరావు, సీహెచ్. రూప, వంగా శ్రీనివాస్, అబ్దుల్ గఫార్, జేవీవీ కుమారి ఎం.మాల్యాద్రి పాల్గొన్నారు.

రంజాన్‌కు మసీదుల ముస్తాబు



తోట్లవల్లూరు: రంజాన్ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు ముస్లింలు ఉపవాస దీక్షలు ఆచరించారు. దీక్షల విరమణ సమయంలో పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మండలంలోని ఐలూరు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం గ్రామాల్లోని మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు.

వెంకటేశ్వరస్వామికి విశేష స్నపన తిరుమంజనం



గుడ్లవల్లేరు: ఉగాదిని పురస్కరించుకుని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు విశేష స్నపన తిరు మంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

ప్రతి వర్గాన్నీ మోసగించిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు వంశీకృష్ణ

పమిడిముక్కల(పామర్రు): సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక ప్రతి వర్గాన్ని సీఎం చంద్రబాబు మోసగించారని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల వంశీకృష్ణ ఆదివారం విమర్శించారు. వలంటీర్లను తొలగించబోమని, గౌరవ వేతనం నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని గత ఉగాది వేడుకల్లో ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ఉగాది వచ్చినా ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఉనికిలో లేదంటున్న కూటమి ప్రభుత్వమే వలంటీర్లందరినీ ఉద్యోగాల నుంచి తొలగించిందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎలాంటి అవినీతి, వివక్ష, పైరవీలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందించిన ఘనత వలంటీర్లకు దక్కిందన్నారు. తమను విధుల్లోకి తీసుకుని రూ.10 వేలు వేతనం ఇస్తారని వలంటీర్లు 10 నెలలుగా ఎరుదుచూస్తున్నారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నమ్మించి మోసగించిన ప్రతి వర్గం, వలంటీర్లు కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



పోలిమెట్ల వంశీకృష్ణ

కోడి పందేల శిబిరంపై దాడి

పామర్రు: మండలంలో కోడి పందేలను నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని కురుమద్దాలి గ్రామ శివారు ప్రాంతంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కోడి పందేలను ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న 10 మోటార్ సైకిళ్లను, జూదరుల నుంచి రూ.1,200ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడికి సత్కారం

మండవల్లి: మండవల్లి మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాసరావును ఉగాది సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఏలూరులో ఆదివారం సత్కరించారు. బ్రాహ్మణ సంఘంలో పెద్దగా ఉంటూ అందరికీ ఆదర్శంగా ఉంటున్న శ్రీనివాసరావును ఈ సందర్భంగా అభినందించారు.

చింతా రవి బాలకృష్ణకు హంస అవార్డు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఆదివారం సీఎం చంద్రబాబు నుంచి హంస అవార్డు అందుకున్నారు. విజయవాడలోనే తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో కళారత్న అవార్డుతో పాటు హంస జ్ఞాపికతో అభినందించారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్

ప్రయాణికుల అవస్థలు

మండవల్లి: మండవల్లిలో నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. మంచినీటి చెరువు గట్టుపై బస్‌షెల్టర్ నిర్మించారు. గుడ్లవల్లేరు, కై కలూరు, గుడివాడ వెళ్లే ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు గతంలో ఈ షెల్టర్ లో బస్సు వచ్చే వరకూ ఎదురుచూసేవారు. ప్రస్తుతం బస్‌షెల్టర్ పూర్తిగా దెబ్బతింది. పైన శ్లాబ్ పగుళ్లు రావడంతో పిచ్చి మొక్కలు మొలిచాయి. వర్షం కురిస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. ఎండ షెల్టర్ లోపలకు వస్తోంది. కనీసం కూర్చోవడానికి అవకాశం లేకుండా ఉంది. దీంతో కళాశాల విద్యార్థులు బస్సులు వచ్చేవరకు రోడ్డుపైనే గడుపుతూ ఇబ్బంది పడుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్

షెల్టర్‌లోనే చెత్త

చెత్తకు నిలయంగా బస్ షెల్టర్ మారింది. ఆటోలు, వ్యాపారులకు షెల్టర్‌గా మారింది. ఇప్పటికైనా బస్‌షెల్టర్ అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ షెల్టర్‌ను అభివృద్ధి చేయాలి



బస్ షెల్టర్ పూర్తిగా దెబ్బతింది. ప్రయాణికులు కూర్చోడానికి అవకాశం లేదు. వ్యాపారులు దీనిని వినియోగించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలి.

– అర్జా రవి, మండవల్లి

వినియోగంలోకి తేవాలి



బస్ షెల్టర్ వల్ల ఎలాటి ఉపయోగం లేదు. విద్యార్థులు, ప్రయాణికులు ఎవరూ దీనిని వినియోగించడం లేదు. ఎవరికీ ఉపయోగపడని బస్ షెల్టర్‌ను అధికారులు అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలి.

– పసుపులేటి నాంచారయ్య, మండవల్లి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

పామర్రు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన పామర్రులో ఆదివారం జరిగిందిది. పోలీసుల కథనం మేరకు విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో పామర్రు వద్ద విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న రెండు మోటార్ సైకిళ్లను, రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన ఇద్దరికి కాళ్లకు దెబ్బలు తగిలాయి. క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు

నూరు శాతం ఇంటి పన్ను వసూలు

గుడ్లవల్లేరు: మండలంలోని ఉలవలపూడిలో నూరు శాతం ఇంటి పన్నుల వసూళ్లను పూర్తి చేసినట్లు ఆ గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, గ్రామ కార్యదర్శి టి.అర్చన తెలిపారు. మొత్తం రూ.80,956 వసూలు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో సర్పంచ్, కార్యదర్శి, సిబ్బందిని ఎంపీడీఓ టి.విజయసారథి అభినందించారు.



ఇంటి పన్ను వసూలు చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

5 నుంచి శ్రీరామనవమి వేడుకలు

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వచ్చే నెల ఐదు నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలను సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీన ఉండ్రపూడి వారిచే ఏకాహం జరుగుతుందన్నారు. 6న సీతారాముల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. 7వ తేదీ ఆలయ ప్రాంగణంలోఉదయం 10 గంటలకు అన్న సమారాధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్లా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, దాడి పవన్‌కుమార్, కూనపరెడ్డి సుబ్బారావు, ఈడే గంటేశ్వరరావు, ఈఓ పీవీఎస్‌వీ ప్రసాదరావు పాల్గొన్నారు.



శ్రీరామనవమి వేడుకల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

చలివేంద్రం ప్రారంభం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బస్ స్టేషన్‌లో తాగునీటి చలివేంద్రాన్ని ఆదివారం గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ, కూచిపూడి ఎస్‌ఐ కే నాగవిశ్వనాథ్ ప్రారంభించారు. తొలి రోజు అతిథులు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ చైర్మన్ పిట్టు శ్రీనివాసరావు, అధ్యక్షుడు తాళ్లూరి మోహన్‌కుమార్, సభ్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, పాగోలు రమేష్ బాబు, అమరబాలేశ్వరరావు, మంత్రయ్య, డాక్టర్ వడ్లాది విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

పెద్దింట్లమ్మకు మొక్కుల చెల్లింపు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఆదివారం భక్తులు రద్దీ కనిపించింది. సమీప జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేడి నైవేద్యాలు సమర్పించారు. కోనేరులో స్నానాలు ఆచరించి పొంగళ్లను అందించారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పాత కాంట్రాక్టు సిబ్బందినే కొనసాగించాలి

కైకలూరు: పంచాయతీ పాత కాంట్రాక్టు సిబ్బందినే కొనసాగించాలని 10 మంది వార్డు సభ్యులు కోరారు. స్థానిక కస్తూరి ప్లాజా వద్ద వార్డు సభ్యుడు కేవీఎస్ఎం.నాయుడు ఆధ్వర్యంలో కైకలూరు పంచాయతీ వార్డు సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. పంచాయతీ పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా, చెత్త రిక్షా లాగుడు కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు, చెత్త ట్రాక్టర్ డ్రైవర్లు, కరెంటు సిబ్బంది నియామకానికి సీల్డ్ టెండర్లు ఇటీవల జరిగాయి. తక్కువ కోట్ చేసిన వ్యక్తికి టెండర్లు దక్కాయి. ఈ విషయంపై వార్డు సభ్యులు మాట్లాడుతూ పాత కాంట్రాక్టు సిబ్బందినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బినామీ టెండర్లు వేశారనే అనుమానం ఉందన్నారు. టెండర్ల మినిట్ బుక్‌లో నివేదికను తారుమారు చేశారన్నారు. పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మేడూరి నాంచారయ్య, పిచ్చికల శివరమ్య, సుధారాణి, అమన్నాకౌర్, బెల్లాని శ్యామలరావు, సమతం శ్రీను, తోట మహేష్, జ్యోతి, బిరుదుగడ్డ రాజామణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఉగాదిని పురస్కరించుకుని అమరావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ఉప సర్పంచ్ సూరపనేని సత్యనారయణ పారిశుద్ధ్య కార్మికులను ఆదివారం సన్మాంచారు. ఈ సందర్భంగా అమరావతి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఉగాది రోజున పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, రూ.500 అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో నిందితులను శిక్షించాలి

కైకలూరు: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని కలిదిండి మండల పాస్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ మరణం హత్యగానే భావిస్తున్నామన్నారు. పోలీసులు మౌనం వీడాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పాస్టర్ల సంఘాల సభ్యులు, పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.



కలిదిండి సెంటర్‌లో పాస్టర్ల ర్యాలీ

స్థానిక సంస్థల ఫలితాలు కూటమికి గుణపాఠం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్

కంకిపాడు: ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఫలితాలు కూటమికి గుణపాఠం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ అన్నారు. ఆదివారం కంకిపాడు వచ్చిన ప్రణీత్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఉపసర్పంచ్, ఎంపీపీ స్థానాల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా వైఎస్సార్ సీపీ బలాన్ని నిరూపించారన్నారు. కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తలొగ్గకుండా వైఎస్సార్ సీపీ మద్దతు దారులకే మద్దతుగా నిలిచారన్నారు. మెజారిటీ స్థానాలను వైఎస్సార్ సీపీ దక్కించుకుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలే టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు సాగిస్తోందన్నారు. కుట్రలను భరిస్తూ వైఎస్సార్ సీపీ పక్షానే నేతలు, ప్రజాప్రతినిధులు నిలిచారన్నారు. కూటమి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసి ప్రభుత్వ వైఫల్యాలపై చైతన్యపరచాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.



జి.ప్రణీత్‌కుమార్



